క్లుప్తంగా

నేడు పెన్షనర్ల సమావేశం

నెల్లూరు(బృందావనం): స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్వీఎస్ మూర్తి శనివారం తెలిపారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ భవనంలో జరిగే సమావేశానికి పెన్షనర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రేపు ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

నెల్లూరు(అర్బన్): నగరంలోని పురమందిరంలో ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య శనివారం తెలిపారు. పెన్షనర్ల పెండింగ్ సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సాయిభాస్కర్ ఆస్పత్రికి చెందిన మోకాళ్ల కీళ్ల మార్పిడి స్పెషలిస్ట్ శివారెడ్డి హాజరై వృద్ధుల్లో వచ్చే ఎముకలు, కీళ్ల సమస్యలు, మోకీళ్ల మార్పిడి, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

భక్తి గీతాలాపన పోటీలు నేడు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి సందర్భంగా సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఆదివారం సాయంత్రం భక్తిగీతాలాపన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక అధ్యక్షుడు డీ రాధాకృష్ణ శనివారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వివరాలకు 78938 47709 నంబరులో సంప్రదించాలని కోరారు.

భక్తి పుస్తకాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి సందర్భంగా నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జేసీఐ నెల్లూరు టౌన్ శాఖ ఆధ్వర్యంలో 400 మంది భక్తులకు శివస్తోత్ర, శివ సహస్రనామ, శివస్తోత్ర రత్నావళి పుస్తకాలను పంపిణీ చేశారు. కందల రాజారెడ్డి(అల్లూరు), కనుమళ్ల అశోక్ సహకారంతో భక్తి పుస్తకాలను పంపిణీ చేసినట్లు జేసీఐ టౌన్ కార్యదర్శులు సాయిరామన్, పాదర్తి బాలాజీ తెలిపారు. జేసీఐ టౌన్ పూర్వ అధ్యక్షులు వెంకట సురేష్‌బాబు, సీహెచ్ కిషన్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బాలిక ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు..బుజబుజనెల్లూరు వల్లూరమ్మకాలనీలో శశిప్రియ తన ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె క్యాటరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమార్తెను ఆరోతరగతి వరకు చదివించారు. ఆర్థిక స్తోమత లేక ఆ తరువాత చదువు మాన్పించింది. గతంలో శశిప్రియ రామకోటయ్యనగర్‌లో నివాసం ఉండే సమయంలో అదే ప్రాంతానికి చెందిన బాలుడు ఫోన్‌లో తన కుమార్తెతో మాట్లాడుతుండడాన్ని గమనించి మందలించింది. గతేడాది నవంబరులో బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోగా అప్పట్లో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా గుర్తించి అప్పగించారు. తిరిగి డిసెంబర్‌లో బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లి వేదాయపాళెం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



నెల్లూరు(క్రైమ్): మహాశివరాత్రి సందర్భంగా టీపీగూడూరు మండలం కాటేపల్లి సముద్రతీరంలోని కామాక్షి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానాన్ని ఎస్పీ సీహెచ్ విజయారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సముద్ర తీరప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజల తాకిడి అధికంగా ఉండటంతో ప్రమాదాలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట నెల్లూరు రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయరెడ్డి, స్థానిక పోలీసు అధికారుల, తదితరులు ఉన్నారు.

నెల్లూరు రచయితకు జాతీయ పురస్కారం



నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య జాతీయస్థాయి సాహిత్య పురస్కారం ''భారత్ భాషా భూషణ్''ను అందుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో లయన్స్ క్లబ్ భోపాల్‌సాత్‌లో అఖిల భారతీయ భాషా సాహిత్య సంస్థ 57వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ సాహిత్య సదస్సును శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆ రాష్ట్ర వైద్య,విద్య, పునరావాస శాఖ మంత్రి విశ్వాస్‌సారంగ్ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు టేకుమళ్ల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరుకు చెందిన మరో కవి డాక్టర్ పెరుగురామకృష్ణ ''సరస్వతీ సమ్మాన్'' పురస్కారానికి ఎంపికవగా, ఆయన తరఫున తాను అందుకున్నానని వివరించారు.

హరహర మహాదేవ శంభో

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- శైవక్షేత్రాల్లో విశేష పూజలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన సర్వేశ్వరుడి కొలువులు



మూలస్థానేశ్వరుడి గిన్నెభిక్ష అలంకారోత్సవం



మూలస్థానేశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి పర్వదినాన్ని నగర ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నగరంలోని శైవక్షేత్రాల్లో ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి లింగోద్భవాభిషేకం, విశేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదిదంపతుల దర్శనానికి సర్వేశ్వరుడి కొలువులకు భక్తులు పోటెత్తారు. భక్తుల శివనామస్మరణలతో సర్వేశ్వరుడి కొలువులు మార్మోగాయి.

- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ఉదయం గిన్నెభిక్ష అలంకారం, రాత్రి 10 గంటలకు లింగోద్భవాభిషేకం, అర్ధరాత్రి 1గంటకు నందిసేవ అలంకారోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా బాలచంద్ర, రాజేష్, రేబాల వెంకటరెడ్డి జ్ఞాపకార్థంగా భార్య ఇందిర, పీ రమేష్‌రెడ్డి ,కమలాకర్‌రెడ్డి, దినకర్‌రెడ్డి వ్యవహరించారు
- మూలాపేటలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉదయంగిన్నెభిక్ష, రాత్రి నందిసేవ ఉత్సవం నిర్వహించారు..
- రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో గిన్నెభిక్ష అలంకారోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆల్తూరు ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా భార్య సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్ కుమార్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్‌కుమార్ రెడ్డి, రాధిక దంపతులు వ్యవహరించారు.
- వహాబ్‌పేట సీఏఎం ఉన్నత పాఠశాలరోడ్డులోని ఉమామహేశ్వరాలయం, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, క్రాంతినగర్‌లోని శివకేశవుల ఆలయం , ములుముడి బస్టాండ్ సమీపంలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కాశీవిశ్వనాథ ఆలయంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన లడ్డూలను భక్తులకు పంచారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వై రమణకుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర సైకత లింగానికి విశేషాభిషేకాలు

మహాశివరాత్రిని పురస్కరించుకుని పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొర్లుకట్ట వద్ద పవిత్ర పెన్నానదిలో సైకత లింగాన్ని ప్రతిష్ఠించి అర్ధనారీశ్వర అలంకారం గావించారు. అర్ధనారీశ్వరుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, మునీంద్ర, శేషుబాబు, బుజ్జయ్య, నాగేంద్ర, పుల్లారెడ్డి, నాగరనాజు, బొక్కలింగం, సుధాకర్, అమరేంద్ర, శేఖర్, కొండయ్య, భరత్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కోడూరుపాడులోని గంగాపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, పెద్దచెరుకూరులోని బాలత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, తల్పగిరి కాలనీలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి లింగోద్భవాభిషేకం జరిపారు.శివనామస్మరణలతో శివాలయాలు మార్మోగాయి.

అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలో..

మహాశివరాత్రి, శనిత్రయోదశిని పురస్కరించుకుని సుజాతమ్మ కాలనీలోని అవధూత దత్తపీఠం నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణయోగ మందిర ప్రాంగణంలోని ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏకరుద్రాభిషేకం, నందీశ్వరుడు, నాగేశ్వరస్వామికి ప్రదోషకాల పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవకాల అభిషేకాలు, తైలాభిషేకాలు విశేషంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.30గంటలకు ఉమాదేవి, నాగేశ్వరస్వామి కల్యాణం, రాత్రి 7గంటలకు పల్లకిసేవ నిర్వహించనున్నట్లు శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞానబోధ సభ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయకుమార్ తెలిపారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున పాలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వపత్ర అష్టోత్తరనామార్చన, రాత్రి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆదివారం స్వామివారికి పూలంగిసేవ, సోమవారం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



మూలస్థానేశ్వరాలయంలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు



మూలస్థానేశ్వరుడ్ని దర్శించుకున్న కలెక్టర్ చక్రధర్‌బాబు



మూలస్థానేశ్వరుడ్ని దర్శించుకున్న కమిషనర్ హరిత



సుజాతమ్మకాలనీలో శనిత్రయోదశి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకత లింగానికి పూజలు



ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథ ఆలయంలో భక్తులకు లడ్డూప్రసాదం పంపిణీ



సుజాతమ్మకాలనీలోని కృష్ణయోగ మందిరంలో నాగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



వెంకటేశ్వరపురంలో కోలాటం ఆడుతున్న మహిళలు

గృహసారథులు సంక్షేమ వారధుల్లా నిలవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

- నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గృహసారథులు సంక్షేమ వారధుల్లా నిలవాలని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 6,7,8 డివిజన్లకు సంబంధించి స్టోన్‌హౌస్‌పేట ఎస్‌బీఎస్ కళ్యాణ మండపం, 50,51,52 డివిజన్లకు సంబంధించి రంగనాయకులపేటలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లేందుకు గృహసారథులను నియమించారని తెలిపారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా గృహసారథులు ఇంటింటిని సందర్శించి గత ప్రభుత్వం ఏం చేసింది? మన ప్రభుత్వంలో ఏం చేస్తున్నాం.. అన్న తేడాను ప్రజలకు వివరించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. శెట్టిగుంట రోడ్డులో పలు అంతర్గతరోడ్ల పనులు పూర్తి చేశామన్నారు. సర్వేపల్లి కాలువ పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. నవాబుపేట ప్రాంతంలో రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నగర ప్రజల ముందుకు వెళ్లాలని కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు సూచించారు. కార్పొరేటర్లు మస్తానమ్మ, మాల్యాద్రి, కామాక్షీదేవి, జయలక్ష్మి, సాహిత్య, అస్మ, ఏపీ ఆగ్రోడెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

నెల్లూరు(బృందావనం): శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో ఆదివారం ఉదయం 9.30గంటలకు శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం శనివారం తెలిపారు. ఉదయం 7గంటలకు పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

వృద్ధురాలికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలిని దుర్భాషలాడుతూ నెట్టడంతో వెనుకకు పడిపోయి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన జనార్దన్‌రెడ్డికాలనీలో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు...జనార్దన్‌రెడ్డికాలనీలో నసీమా, ఖుద్దూస్ దంపతులు నివాసం ఉంటున్నారు. నసీమా స్థానికంగా టిఫిన్ అంగడి నిర్వహిస్తోంది. అదేప్రాంతంలో సురేంద్ర కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తె నసీమా వద్ద టిఫిన్ తీసుకుంది. మరో టిఫిన్ అంగడికి వెళ్లి అక్కడ టిఫిన్ తీసుకుంది. గమనించిన నసీమా అక్కడ ఎందుకు తీసుకున్నావని గద్దించింది. ఈ విషయం తెలుసుకున్న సురేంద్ర, అతని కుటుంబసభ్యులు నసీమాను దుర్భాషలాడి నెట్టడంతో ఆమె వెనక్కిపడింది. తలకు గాయమైంది. ప్రస్తుతం ఆమె నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి సందర్భంగా విరాట్‌నగర్, మెక్లిన్స్‌రోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత అధ్యక్షుడు కందుకూరు చెంగయ్యఆచారి, ప్రధాన కార్యదర్శి ఇందుకూరు రమేష్‌కుమార్‌ఆచారి, కార్యనిర్వాహక కార్యదర్శి బల్లవోలు రమణయ్యఆచారి, కోశాధికారి దండపాణి సురేష్‌ఆచారి, సిద్ధయ్యఆచారి, డీ నాగార్జునఆచారి, వీ బాలకృష్ణఆచారి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు


ఆర్పీఐ(ఏ) జిల్లా కార్యవర్గ సమావేశం



శివనాగేశ్వరరావుగౌడ్‌కు సన్మానం

నెల్లూరు(బృందావనం): మద్రాస్‌బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలె) పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్ పేరం శివనాగేశ్వరరావుగౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ మిర్యాల వెంకటరమణయ్య హాజరై భారతరాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ స్థాపించిన పార్టీ సమాజంలో బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆర్పీఐ(అథవాలె) జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలె బాబాసాహెబ్ ఆశయసాధనకు ఎంతో కృషిచేస్తున్నారన్నారు. అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, మీడియా జనరల్ సెక్రటరీగా చెరుకూరి రామకృష్ణారావు , జిల్లా మహిళావిభాగం ప్రధానకార్యదర్శిగా చేజర్ల విజయలక్ష్మి, యువజన విభాగం అధ్యక్షుడిగా అరవ పుష్పరాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ కరీముల్లా, విద్యార్థి విభాగం కార్యదర్శులుగా డీ చక్రధర్‌బాబు, ఏ కిషోర్, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బీ మమతకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుగౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

ఆర్‌అండ్‌బీ ఎస్ఈకు వినతి



ఆర్‌అండ్‌బీ ఎస్ఈకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

నెల్లూరు(బారకాసు): రహదారుల,భవనాల శాఖలో పనిచేస్తున్న ఫీల్డ్‌స్టాఫ్‌కు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విషయంలో మినహాయింపు ఇవ్వాలని జేఏసీ నాయకుడు శరత్‌బాబు కోరారు. ఈ మేరకు నగరంలోని ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ గంగాధర్‌కు ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ నాయకులు మస్తానయ్య, సురేష్, శంకర్‌బాబు, జాకీర్, షబ్బీర్‌అహ్మద్, రవీంద్రబాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగికృష్ణ

నెల్లూరు (టౌన్): తమపై దాడికి పాల్పడిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది అక్టోబర్ 17న టీడీపీ మైనార్టీ నాయకుడు అల్లాభక్షుపై రూరల్ ఎమ్మెల్యే అనుచరులు దాడికి యత్నించారని తెలిపారు. ఆ సమయంలో ఆయనకు తాను అండగా నిలబడ్డానని, మరుసటి రోజే ఎమ్మెల్యే అనుచరులు తనపై దాడి చేసి చంపబోయారని ఆరోపించారు. అప్పట్లో పురుషోత్తం, సునీల్, తాటి వెంకటేశ్వర్లుతో పాటు మొత్తం 25 మంది దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని చెప్పారు. ఈ కేసు విషయంలో చర్యలు తీసుకోకపోవడంతో ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించగా వారు నోటీసులు పంపడంతో పోలీసులు స్పందించారన్నారు. గత మూడున్నరేళ్ల కాలంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి ఎన్నో అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు చేశారన్నారు. అందుకు సంబంధించి మొత్తం 11 మంది మీదపై కేసులు పెట్టామని, వారు కాక మరో పది మంది ఉన్నారని తెలిపారు. సీసీ పుటేజీలు పరిశీలించి మిగిలిన వారిపైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రూరల్ ఎమ్మెల్యే తన అనుచరులు తాటి వెంకటేశ్వర్లు, రఘు, జావెద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని తెగ బాధ పడుతున్నారని, తమపై దాడి చేసే సమయంలో తమకుటుంబ సభ్యులు గుర్తుకురా లేదాని ప్రశ్నించారురు. నెల్లూరు పార్లమెంటరీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అల్లాభక్షు, నాయకులు సాబీర్‌ఖాన్, జలదంకి సుధాకర్, దత్తాత్రేయ, రేవతి, అస్లామ్, వెంకటశేషు, ఇజ్రాయేల్, మారుతి, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

నిఘా కొరవడి..నేరాల ఒరవడి

- దర్గామిట్ట స్టేషన్ పరిధిలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు
- నేరనియంత్రణలో పోలీసులు విఫలం



గోనెసంచిలోని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు(ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నగరంలోని దర్గామిట్ట పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసుల నిఘా కొరవడడంతో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతోంది. ఇటీవల వరుస హత్యలు, హత్యాయత్నాలు, దొంగతనాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నా నేరనియంత్రణకు పోలీసులు అడ్డుకట్ట వేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి దర్గామిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్‌తో పాటు నలుగురు ఎస్సైలు, 50 మందికిపైగా వివిధ హోదాల్లో సిబ్బంది ఉన్నారు. గత కొంతకాలంగా స్టేషన్ పరిధిలో పోలీసు నిఘా కొరవడింది. స్టేషన్ పోలీసు అధికారుల ఉదాసీన వైఖరి, సిబ్బంది మొక్కుబడి విధులు వెరసి శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దాడులు జరుగుతూనే ఉన్నాయి. హత్యలు, హత్యాయత్నాలు నిత్యకృత్యంగా మారాయి. రౌడీషీటర్లు ఏకంగా పోలీసులపైనే దాడులకు పాల్పడిన ఘటనలు జరిగాయి. స్టేషన్ పరిధిలోని ఓ బార్‌లో 24గంటలు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం మత్తులో మందుబాబుల వీరంగాలు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే నేరాలు

పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని స్వర్ణాల చెరువు పరిసర ప్రాంతాలు రాత్రి అయితే అసాంఘీక కార్యక్రమాలకు నెలవుగా మారాయి. మందుబాబులు పూటుగా మద్యంసేవించి గొడవలు చేస్తున్నారు. అసాంఘీక శక్తులు, రౌడీషీటర్లు ఇదే ప్రాంతంలో పాగావేసి నేరాలకు పాల్పడుతున్నారు. గతంలో ఓ యువకుడిపై కొందరు యువకులు కత్తులు, రాడ్లతో విచక్షణారహితంగా దాడిచేశారు. సదరు యువకుడు వారిని తప్పించుకుని ప్రాణభయంతో రోడ్డుపైకి పరుగులు తీశారు. అటుగా వెళుతున్న పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందిని అప్రమత్తం చేయడంతో సదరు యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఇటీవల సమీర్‌ఖాన్ అనే వ్యక్తిపై మాజీ రౌడీషీటర్ సయ్యద్‌నమీ, అతని అనుచరులు హత్యాయత్నం చేశారు. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే ఇక స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లోని పరిస్థితి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మిస్టరీగానే గోనె సంచిలోని మృతదేహం

గతేడాది నవంబర్‌లో గౌతమినగర్ రెండోవీధిలో గోనెసంచిలో యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో లేఖను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో ఓ యువతినిచ్చి తనకు వివాహం చేస్తారని, ఆమె కుటుంబసభ్యులు నమ్మించి నగదు తీసుకుని మోసగించారని, వారి ఫోను నంబర్లు, పేర్లు ఉన్నాయి. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. నెలలు గడుస్తున్నా ఈ కేసు దర్యాప్తు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. కనీసం మృతుడు ఎవ్వరు? ఏ ప్రాంతం వాడు? ఇక్కడ ఎందుకు ఉంటున్నాడు? ఇలా ఏ ఒక్క సమాచారాన్ని సేకరించడంలో స్థానిక పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

- మిలటరీ కాలనీలో విశ్రాంత మైనింగ్ జేడీ ఇంట్లో దొంగలు పడి రూ 1.74కోట్ల సొత్తును దోచుకెళ్లారు. సంఘటన జరిగి ఆరు రోజులు గడుస్తున్నా ఇంతవరకూ ఒక్క ఆధారాన్ని పోలీసులు సేకరించలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. వరుస ఘటనలు జరుగుతున్నా పోలీసులు మొక్కుబడి విధులకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.